క్లుప్తంగా

సర్కారు బడిలో చేరికల పట్ల ఆసక్తి



అమృతలూరు(భట్టిప్రోలు): అమృతలూరు మండలం గోవాడ పీవీసీ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి చేపడుతున్న అడ్మిషన్లకు స్పందన అభిస్తోంది. విద్యార్థుల తల్లిదండ్రులు హైస్కూల్‌లో ఇంగ్లీష్ మీడియంలో చేర్పించేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఇప్పటి వరకు 50 మంది విద్యార్థులు హైస్కూల్‌లో చేరేందుకు అడ్మిషన్లు తీసుకున్నట్లు ప్రధానోపాధ్యాయులు టి.శివశంకరరావు తెలిపారు.

బుల్లిబాబు మృతికి కారుకులను శిక్షించాలి

నెహ్రూనగర్: బుల్లిబాబు మృతికి కారుకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కూచిపూడి సత్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మార్చురీ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ పదేళ్లుగా వడ్డమాను గ్రామంలో ఓ కుటుంబం వద్ద కూలీ పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడని...సోమవారం పోలాల్లో శవమై కనిపించాడని... ఒంటిపై తీవ్ర గాయాలతో చనిపోయిన బుల్లిబాబు మృతి చెందినట్లు చెప్పారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

21 నుంచి ఐఏఎస్ ఫౌండేషన్ తరగతులు

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల స్థాయి విద్యార్థులకు ఈనెల 21వ తేదీ నుంచి పదిరోజుల పాటు ఐఏఎస్ ఫౌండేషన్ తరగతులు ఉచితంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్(సన్) కన్వీనర్ కె. సాయికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామన్నపేట ఒకటో లైనులోని జనచైతన్య వేదిక కార్యాలయంలో ప్రతి రోజూ సాయంత్రం 6.00 గంటల నుంచి రెండు గంటల పాటు తరగతులు ఉంటాయని చెప్పారు. పాఠశాల స్థాయి విద్యార్థులు హాజరు కావచ్చునని పేర్కొన్నారు. పేర్లు నమోదు చేసుకునేందుకు 72075 66702, 63094 81514, 86888 97406లో సంప్రదించాలని సూచించారు. సివిల్స్ శిక్షణ నిపుణులు, ఉన్నతాధికారులు తరగతులను బోధిస్తారని పేర్కొన్నారు.

తొలి సారి ఓటేసిన యానాదులు

నెహ్రూనగర్: కాకుమానువారితోటలో నివాసం ఉండే యానాదులు 2024 సార్వత్రిక ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. వారు సంచార జాతులు కావడంతో సరైన పత్రాలు లేకపోవడంతో వారెవరికి ఓటు హక్కు లేదు. వారి సమస్యను తెలుసుకున్న బహుజన మహాసభ సెంట్రల్ కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్ సింగ్ అధికారులతో మాట్లాడి వారికి ఓటర్ కార్డు, ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు ఇప్పించారు.

నేడు వైకే నాగేశ్వరరావు స్మారక పురస్కారాల ప్రదానం

నగరంపాలెం: సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు ఆధ్వర్యంలో యువ కళావాహిని నిర్వహణలో వైకే నాగేశ్వరరావు స్మారక పురస్కారాలను బుధవారం ప్రదానం చేయనున్నట్లు సంస్థ అధ్యక్షుడు లంకా లక్ష్మీసూర్యనారాయణ, కార్యదర్శి జి.మల్లికార్జునరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై హాస్యరస సార్వభౌమ డాక్టర్ శంకరనారాయణ, లఘు చిత్ర దర్శకుడు గుమ్మడి ప్రేమ్‌చంద్, ప్రముఖ రంగస్థల నటి లహరి, ప్రముఖ రంగస్థల, పౌరాణిక నటులు డాక్టర్ ముప్వా పెదబాబురెడ్డిలకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా 'మూల్యం ' అనే నాటిక ప్రదర్శించనున్నట్లు చెప్పారు.

పోలింగ్ సిబ్బంది అలసత్వం

- మాక్ పోలింగ్ తొలగించకుండానే ఎన్నికల ప్రక్రియ కొనసాగింపు
- ఉన్నతాధికారులకు మాక్ పోలింగ్ వివరాల నివేదిక

పెదకాకాని: మాక్ పోలింగ్ తొలగించకుండా ఓటింగ్ ప్రక్రియ కొనసాగించడంతో గందరగోళం నెలకొంది. పోలింగ్ సిబ్బంది బాధ్యతా రాహిత్యానికి ఇది నిదర్శనంగా మారింది. పెదకాకాని మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో 64 పోలింగ్ బూత్‌లో మాక్ పోలింగ్ నిర్వహించి వాటిని క్లియర్ చేయకుండానే ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. సాయంత్రం మాక్ పోలింగ్ సంఖ్య తొలగించలేదని గుర్తించని ఉన్నతాధికారులు 17సి రిజిష్టర్‌లో నివేదిక అందజేశారు. ఆ పోలింగ్ స్టేషన్‌కు చేరుకున్న పోలింగ్ పర్యవేక్షణ అధికారులు పోలింగ్ బూత్ అధికారి ముందుగా వేసిన మాక్ పోలింగ్ సంఖ్య 50గా గుర్తించారు. మాక్ పోలింగ్‌కు సంబంధించిన సంఖ్యను క్లియర్ చేయకుండానే పొరపాటున ఎన్నికల ప్రక్రియ కొనసాగించడం జరిగిందన్నారు. ఆ ఓట్ల సంఖ్య నుంచి 50 ఓట్లు తగ్గించాలని నిర్ణయించినట్లు చెప్పారు. వాటిలో ఏ పార్టీకి ఎన్ని ఓట్లు పోల్ అయ్యాయో వాటి వివరాలతో కూడిన నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించినట్లు అధికారులు వెల్లడించారు.

బండ్లమ్మ తిరునాళ్లకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలు
- ఉత్సవాల్లో భాగంగా ఊరేగనున్న అమ్మవారి ఘటాలు
- పలు ప్రాంతాల నుంచి తరలిరానున్న భక్త జనం

చందోలు(పిట్టలవానిపాలెం): భక్తుల కొంగుబంగారంగా వెలసిన చందోలు బగళాముఖి అమ్మవారి (బండ్లమ్మ) తిరునాళ్ల నేటి నుంచి ప్రారంభం కానుంది. ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారి ఘటాలు పురవీధుల్లో తిరుగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నాయి. 19న అమ్మవారిని నగలతో అలంకరించనున్నారు. అమ్మవారి అలంకరణను తిలకించేందుకు దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరానున్నారు. ఉత్సవాలను నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కార్యనిర్వణాధికారి నరసింహమూర్తి తెలిపారు.

ఐలవరం తిరునాళ్లకు ఏర్పాట్లు

ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరంలో కొలువైన శ్రీ భద్రావతి సమేత శ్రీ భావనారుషి స్వామి వారు, శ్రీ మార్కండేయ ఈశ్వర భద్రావతి సమేత శ్రీ భావనారుషి స్వామి వారి కల్యాణ మహోత్సవాలు ప్రతి ఏటా వైశాఖ శుద్ధ పౌర్ణమికి వైభవోపేతంగా జరగనున్నాయి. 21న స్వామి వారి కల్యాణం, 22న స్వామి వార్ల దివ్య రథోత్సవాలు జరుగుతాయని రెండు దేవాలయాల నిర్వాహకులు తెలిపారు. ఎంతో చరిత్ర కలిగిన స్వామి వారి పట్ల భక్తి ప్రపత్తులతో ప్రతి



బండ్లమ్మ వారి దేవాలయం

ఏటా ఈ కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నారు. స్వామి వారి ఉత్సవాలు పురస్కరించుకుని దేవాలయాల ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఘనంగా హరిద్ర శృంగార్చన

పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బండ్లమ్మ వారిని మహా గౌరీ దేవిగా అలంకరించారు. దీంతో పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల



బగళాముఖి అమ్మవారు

మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.



స్వామివార్లు పురవీధుల్లో ఊరేగుతున్న రథోత్సవాలు

అకాల వర్షాలు.. కర్షకుల కన్నీళ్లు



భట్టిప్రోలులో మొక్కజొన్నపై పరిచిన పట్టాలు

మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు అవస్థలు

భట్టిప్రోలు: అకాల వర్షాల ప్రభావంతో మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. వర్షం దెబ్బకు రైతులు పట్టాలు కప్పుతున్నారు. ఈదురు గాలులు వేయడంతో పట్టాలపై బరువులు వేసి ఉంచుతున్నారు. పంట పొలాల్లో విరిచిన కండెలు అలానే పడి ఉన్నాయి. మరికొంత పంట నిలువు మీదే పంట చేలో అలానే ఉంది. కండెలు బరువై వాలిపోయి పడిపోతున్నాయి. ఈ అకాల వర్షాలు రైతులకు అపార నష్టం కలిగించాయి. పంట దిగుబడులను ఆరబెట్టుకోవడం, భద్రపరచుకోవడంతోనే రైతులకు సమయం సరిపోతుంది. దీంతో అదనపు కూలీ చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు తెలిపారు.



భట్టిప్రోలులో పంట పొలాల్లో విరిచిన కండెలు

చినుకు పడితే చిత్తడే..!

- రహదారులపై ఇటుక మట్టి పేరుకుపోయి వాహనదారుల ఇక్కట్లు
- ఇటుక తయారీ పరిశ్రమల నిర్వాహకుల ఉదాసీనతపై పలు గ్రామాల ప్రజల ఆగ్రహం

కొల్లూరు : ఇటుక తయారీ పరిశ్రమ నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాల్లో రహదారుల వ్యవస్థ ఛిద్రమవుతోంది. ఇటుక తయారీకి వినియోగించే మట్టి రోడ్లపై పేరుకుపోయి రహదారులు డొంక రోడ్లకు మించి అధ్వానంగా తయారవుతున్నాయి. మండలంలోని గాజుల్లంక, పోతార్లంక, తోకలవారిపాలెం, కిష్కిందపాలెం, పెసర్లంక గ్రామాల పరిధిలోని రహదారులపై ఇటుక బట్టీలకు అవసరమైన మట్టి తరలించే క్రమంలో రోడ్లపై భారీగా మట్టి పేరుకుపోతోంది. వర్షాలు కురిసిన క్రమంలో వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారుతోంది. వర్షానికి తడిచిన బంకమట్టిపై ప్రయాణించే ద్విచక్ర వాహనాలు చక్రాలకు బురద పేరుకుపోయి వాహనాలు ముందుక కదలడానికి మొరాయిస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షపు చినుకులకు తడిచిన ఈ రోడ్లపై వాహనాలు జారిపోతుండటంతో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. అధికారులు తక్షణం స్పందించి రహదారులపై పేరుకుపోయిన బురదను ఇటుక బట్టీల నిర్వాకులు తొలగించేలా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరతున్నారు.



గాజుల్లంక-పోతార్లంక మధ్య రహదారిపై పేరుకుపోయిన ఇటుక మట్టి

వెల్లివిరిసిన చైతన్యం.. ఓటరులో నవ్యోత్సాహం

- పెదకాకానిలో 86.36 శాతం పోలింగ్
- తక్కెళ్ళపాడులో టీడీపీ నాయకుల బెదిరింపులు
- పలు బూత్‌లలో ఉదాసీనత కనబరచిన పోలింగ్ సిబ్బంది
- ప్రేక్షక పాత్ర వహించిన పోలీసులు

పెదకాకాని: సార్వత్రిక ఎన్నికల్లో సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టేందుకు ఓటర్లు ఉత్సాహం కనపరచారు. తెల్లవారే సరికి పోలింగ్‌బూత్‌ల వద్ద బారులు తీరిన ఓటర్లు రాత్రి 10 గంటల వరకూ పలు పోలింగ్‌బూత్‌ల వద్ద ఓటు వేసేందుకు వేచి ఉన్నారు. పెదకాకాని మండలంలో గ్రామాల వారీగా.. పెదకాకాని 81.41 శాతం, నంబూరు 86.54 శాతం, తక్కెళ్ళపాడు 86.39, వెనిగండ్ల 90.32, ఉప్పలపాడు 87.16, కొప్పురావూరు 89.41, అగతవరప్పాడు 86.66, గోళ్ళమూడి 93.23, రామచంద్రపాలెం 87.33, వెంకటకృష్ణాపురం 91.97, తంగెళ్ళమూడి 97.11, అనుమర్లపూడి 92.86 శాతం పోలింగ్ నమోదైంది. పెదకాకాని మండలంలో 86.36 శాతం నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. మండలంలోని పెదకాకాని, కొప్పురావూరు, నంబూరు, వెనిగండ్ల, అగతవరప్పాడు గ్రామాల్లోని ఐదు బూత్‌లలో ఈవీఎం మెషీన్లు మొరాయించడంతో ప్రారంభంలోనే ఓటింగ్ ప్రక్రియ 30 నుంచి 40 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది. మధ్యాహ్నం సమయంలో ఎండలు బాగా మండిపోవడంతో పలు బూత్‌ల వద్దకు సాయంత్రం 4 గంటల నుంచి ఓటు వేసేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పెదకాకాని మండలంలోని తక్కెళ్ళపాడు, ఉప్పలపాడు గ్రామాలలో టీడీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడ్డారు. దొంగ ఓట్లు వేయడానికి ఒకరు రావడం, అక్కడే ఉన్న వారి సామాజిక వర్గం వారు ఒక్కసారిగా పోలింగ్ బూత్‌లలోకి చొరబడి బెదిరించడం, ఎట్లకేలకు ఓటు వేయడం వంటి సంఘటనలు పరిపాటిగా జరిగాయి. తక్కెళ్ళపాడులో ఓటర్లు పోలింగ్‌బూత్‌ల వద్దకు వెళ్లే సరికే పలువురు ఓట్లు వేసి ఉండటంతో నిరాశతో ఓటు వేయకుండానే వెనుతిరగడం జరిగింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న పోలీసు సిబ్బంది ప్రేక్షక పాత్ర వహించారు. పోలింగ్ సిబ్బంది సైతం కొందరు ప్రభుత్వ వ్యతిరేక ఓటు వేసేందుకు పెత్తందార్లకు సహకరించారు.



సాహిత్యంలో మాతృమూర్తికి విశిష్ట స్థానం



నగరంపాలెం: ప్రాచీన భారతీయ సాహిత్యం నుంచి నేటి వరకు కవులు తమ కావ్యాల్లో మాతృమూర్తికి విశిష్ట స్థానం కల్పించారని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ బీరం సుందరరావు అన్నారు. గుళ్ళపల్లి సుబ్బారావు సేవా సంస్థ సౌజన్యంతో రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై మంగళవారం అంతర్జాతీయ మాతృదినోత్సవ సభ మంగళవారం నిర్వహించారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ తూనుగుంట్ల రాధాభాయ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి డాక్టర్ బీరం సుందరరావు మాట్లాడుతూ మన సంస్కృతిలో మాతృమూర్తికి విశిష్ట స్థానం ఉందని అన్నారు. తద్వారా మనం మాతృదేవోభవః అని ముందుగా తల్లికి ప్రణవిల్లుతామని పేర్కొన్నారు. సంస్థ కార్యదర్శి ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వి.నాగరాజ్యలక్ష్మి, మంజుల మాట్లాడగా, ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం అతిధులను గుళ్లపల్లి సేవా సంస్థ నిర్వహకులు గుళ్లపల్లి రాఘవేంద్రరావును సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి ఓల్డ్ టోల్‌గేటు వద్ద మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆశ్రమం రోడ్డు నుంచి గుంటూరు- విజయవాడ సర్వీస్ రోడ్‌లోకి ద్విచక్ర వాహనంపై వస్తున్న రాజ్ బహదూర్ శంకర్ పండిట్‌ను విజయవాడ గుంటూరు వైపు సర్వీస్‌రోడ్‌లో వెళుతున్న ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన పండిట్, సీలింగ్ పనులు చేస్తూ విజయవాడ కృష్ణలంకలో నివాస ముంటున్నాడు. సోమవారం రాత్రి సమయంలో ఆశ్రమం రోడ్‌లో పనులు చేసి తిరిగి ఇంటికి వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుందని, ఈ ప్రమాదంలో పండిట్‌తో పాటు గాయపడిన శ్రీనివాసరావును స్థానికులు 108లో విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారని చెప్పారు. ఢీ కొట్టినే వారు ద్విచక్రవాహనాన్ని వదిలి అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. జరిగిన ఈ ఘటనపై రాజ్‌బహదూర్ శంకర్ పండిట్ బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

21 నుంచి ఐఏఎస్ ఫౌండేషన్ తరగతులు

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల స్థాయి విద్యార్థులకు ఈనెల 21వ తేదీ నుంచి పదిరోజుల పాటు ఐఏఎస్ ఫౌండేషన్ తరగతులు ఉచితంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్(సన్) కన్వీనర్ కె. సాయికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామన్నపేట ఒకటో లైనులోని జనచైతన్య వేదిక కార్యాలయంలో ప్రతి రోజూ సాయంత్రం 6.00 గంటల నుంచి రెండు గంటల పాటు తరగతులు ఉంటాయని చెప్పారు. పాఠశాల స్థాయి విద్యార్థులు హాజరు కావచ్చునని పేర్కొన్నారు.

మానస సరోవరంలో బుద్ధపౌర్ణమి వేడుకలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి- తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని మహానాడు ప్రాంతంలోని మానస సరోవరంలో ఈనెల 23వ తేదీ బుద్ధపౌర్ణమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రామిరెడ్డి, రమణి మంగళవారం తెలిపారు. 23న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వేడుకలు నిర్వహించనున్నామని, ఈ వేడుకలకు కవి, రచయిత, జాతీయ సాహిత్య సేవా అవార్డు గ్రహీత, డాక్టర్ బొర్రా గోవర్ధన్ విచ్చేయనున్నారని చెప్పారు.

వైఎస్సార్ సీపీ వర్గీయులపై టీడీపీ పెత్తందార్ల దాడి



కావూరులో ఎస్సీ వర్గీయులతో మాట్లాడుతున్న కావటి మనోహర్ నాయుడు

- కావూరులో ఎన్నికల ఏజెంట్‌తో పాటు మరొకరికి తీవ్ర గాయాలు
- మంచినీటి ప్లాంట్ నుంచి నీరు తీసుకెళ్లకుండా కట్టడి
- స్పందించి అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు

చిలకలూరిపేట: టీడీపీ నాయకులు పెత్తందారీ మనస్తత్వం మరోసారి వెలుగుచూసింది. ఇందుకు ఉదాహరణగా చిలకలూరిపేట మండలం కావూరు గ్రామంలో ఎస్సీకాలనీలో పోలింగ్ సందర్భంగా సోమవారం రాత్రి వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ నాయకుల దౌర్జన్య కాండ నిదర్శంగా నిలుస్తోంది. బాధితులు కథనం ప్రకారం... కావూరు గ్రామంలోని ఎస్సీకాలనీ పోలింగ్‌బూత్ 211లో ఉదయం అర్ధగంట ఆలస్యంగా 7.30కు పోలింగ్ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో సాయంత్రం పోలింగ్ ముగిసే సమయానికి ఓట్లు కొన్ని పోల్ కావల్సినవి మిగిలి ఉన్నాయి. దీనికోసం సమయం పెంచాల్సిందిగా వైఎస్సార్‌సీపీ తరుపున బూత్ ఏజెంటుగా ఉన్న నలమాల కాంతయ్య అధికారులకు విజ్ఞప్తి చేశాడు. ఇది నచ్చని టీడీపీలో ఆధిపత్య సామాజిక వర్గానికి చెందిన కొందరు వచ్చి ఘర్షణకు దిగారు. బూత్‌లో ఏజెంట్‌గా ఉన్న నలమాల కాంతయ్యను బయటకు లాగి దాడి చేశారు. మాకు ఎదురు మాట్లాడతావా అంటూ కులం పేరుతో తీవ్ర దూషణలకు దిగారు. ఈ దాడిలో కాంతయ్యకు తీవ్రగాయలయ్యాయి. మూకల దాడిలో తలపగిలి పడిపోయాడు. కాంతయ్యపై దాడిని అడ్డుకునేందుకు వచ్చిన వైఎస్సార్ సీపీ వర్గీయులు కట్టెం ఆనందరావుతో పాటు మరి కొందరికీ కూడా ఈ ఘటనలో గాయాలయ్యాయి. స్థానికులు గాయపడిన వారిని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో కాంతయ్యతో పాటు ఆనందరావును మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. నరసరావుపేట ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్ గాయపడిన వారిని ఫోన్లో పరామర్శించారు.

కొనసాగిన వివక్ష...

ఈ ఘర్షణ నేపథ్యంలో కావూరు గ్రామంలో ఉన్న మంచినీటి ప్లాంట్ నుంచి ఎస్సీ వర్గీయులను మంగళవారం మంచినీరు తీసుకువెళ్లకుండా కట్టడి చేసి వారి దాష్టీకాన్ని చాటుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు గ్రామానికి వెళ్లి బాధితులకు అండగా నిలిచారు. ప్రస్తుతానికి ఎలాంటి నీటి సమస్య లేకుండా ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేసే ఏర్పాటు చేశారు. దీంతో పాటు ఎస్సీ కాలనీలో రూ.6 లక్షలు తన సొంత నిధులతో లూథరన్ చర్చి సమీపంలో కొత్తగా వాటర్ ప్లాంట్ నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు.

కరకట్ట మార్గం.. ప్రయాణం నరకం

- రహదారి ధ్వంసం కావడంతో ప్రయాణికుల అవస్థలు
- వరుస ప్రమాదాలతో ఆందోళన

కొల్లూరు : కరకట్ట మార్గంలో వాహనదారులు ప్రయాణ కష్టాలు ఎదుర్కొంటున్నారు. విజయవాడ నుంచి రాకపోకలకు ప్రధాన మార్గంగా ఉన్న కరకట్ట మార్గం కొల్లూరు సమీపంలో కిలోమీటరు మేర పూర్తిగా ధ్వంసమవ్వడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. కొల్లూరు సమీపంలో కరకట్టపై గతంలో నిర్మించిన సింగిల్ రోడ్డు మార్గం మార్జిన్లు పూర్తిగా ఛిద్రమవ్వడంతో ఈ మార్గంలో ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగించడం ప్రాణాలతో చెలగాటంగా మారింది. రోడ్డు అంచులు కోతలకు గురవడంతో ఎదురొచ్చే వాహనాలకు దారి ఇచ్చేందుకు పక్కకు వెళ్లిన వాహనాలు తిరిగి రోడ్డు ఎక్కే అవకాశం లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించడానికి జంకుతున్నారు. ఇదే మార్గంలో రోడ్డు అధ్వానంగా మారడం కారణంగా గతంలో చోటు చేసుకున్న పలు ప్రమాదాలు కారణంగా అనేకమంది ప్రాణాలు కోల్పోవడంతో పాటు పలువురు అంగవైకల్యంతో బాధపడుతున్నారు. ఈ మార్గంలో ఎదురెదురుగా వచ్చే భారీ వాహనాలు సైతం తప్పుకునే వెసులుబాటు లేకపోవడంతో ప్రమాదం అంచున వాహనాలు ముందుకు వెళ్లాల్సి వస్తోంది. విజయవాడ నుంచి కరకట్ట మార్గంలో ప్రయాణించే ఆర్టీసీ బస్సులు, ఎదురుగా వచ్చే వాహనాలకు దారి ఇచ్చే క్రమంలో కరకట్ట అంచుల వరకు వెళ్లి పక్కకు ఒరిగిపోతుండటంతో ఏ సమయంలో బస్సులు అదుపు కోల్పోయి పల్టీకొట్టి ప్రయాణికుల ప్రాణాల మీదకు వస్తుందోనన్న ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతుంది. వెంటనే ఆర్సీ (రివర్ అండ్ కన్జర్వేషన్) అధికారులు స్పందించి కరకట్ట మార్గాన్ని పునర్నిర్మించాలని స్థానికులు కోరతున్నారు.



కరకట్ట రోడ్డు మార్గం దెబ్బతినడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు పక్కకు ఒరిగిపోతున్న దృశ్యం

పొన్నూరులో పెరిగిన పోలింగ్

- 264 పోలింగ్ కేంద్రాల్లో 84.92 శాతం ఓటింగ్ నమోదు
- 2019లో 83.62 శాతం పోలింగ్
- ఈ ఎన్నికలలో 1.30 శాతం పెరిగిన ఓటింగ్

పొన్నూరు: పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్ సాయంత్రం 6 గంటలకు ముగిసినా మండలంలోని ఇటికంపాడుతో పాటు పలు పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 11 గంటల వరకు ఓటర్లు వేచి ఉండి తమ ఓటుహక్కు వినియోగించు కున్నారు. మంగళవారం ఉదయం 9 గంటల వరకు ఏఎన్‌యూలోని స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంలను తరలించారు. పొన్నూరు నియోజకవర్గంలో మొత్తం 2,27,135 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికలలో పొన్నూరు అసెంబ్లీకి సంబంధించి 14 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 264 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం జరిగిన పోలింగ్‌లో 84.92 శాతం పోలింగ్ నమోదైనట్లు ఆర్వో లక్ష్మీకుమారి మంగళవారం ప్రకటించారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో పొన్నూరు నియోజకవర్గంలో 2,28,234 మంది ఓటర్లలో 1,90,849 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోగా 83.62 శాతం పోలింగ్ నమోదైంది. 2019 ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికలలో పోలింగ్ 1.30 శాతం పెరిగింది.



ఓటు వినియోగించుకున్న ఓటర్లు

ఓటు వేసేందుకు వెళ్తూ వృద్ధుడి మృతి

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని గుండిమెడలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వృద్ధుడి మరో వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు గ్రామంలోని కన్నారెడ్డి పాలేనికి చెందిన బొమ్మారెడ్డి మహాత్మారెడ్డి (70) సోమవారం 10 గంటల సమయంలో ఓటు వేసేందుకు గుండిమెడకు వెళ్లగా గుర్తింపుకార్డు లేదని అధికారులు వెనక్కి పంపించివేశారు. తిరిగి మరల 10.30 గంటల సమయంలో కన్నారెడ్డి పాలేనికి చెందిన మహాత్మారెడ్డి ఆధార్ కార్డు తీసుకుని ఇంటి దగ్గర నుంచి మెల్లెంపూడి గుండిమెడ రోడ్‌లో ద్విచక్రవాహనంపై వస్తుండగా మెల్లెంపూడి నుంచి వచ్చే మరో ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో మహాత్మారెడ్డి కిందపడిపోయాడు. ఈ సమయంలో తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై మహాత్మారెడ్డి బంధువులు తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.